సాక్షి
వికారాబాద్

గురువారం । 24 । ఏప్రిల్ । 2025



పసిడి షాపులపై దాడులు

బంగారం దుకాణాలపై బుధవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. 10లో▸



సమస్యలు పరిష్కరించండి

ప్రజా సమస్యలను ఓర్పుగా విని పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. 10లో▸



ఉగ్రవాద దాడి బాధాకరం

పహల్గామ్ పర్యాటకులపై ఉగ్రవాద దాడి బాధాకరమని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ హరీశ్‌రావు పేర్కొన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

తాండూరు రూరల్: భూ భారతి చట్టంపై గురువారం అవగాహన సదస్సు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ కేతావత్ తారాసింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని అంతారం రైతు వేదికలో ఉదయం 11.30గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి హాజరయ్యే ఈ సమావేశానికి రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులు సకాలంలో హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.

వికారాబాద్ పట్టణంలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో గురువారం భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ లక్ష్మీనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, అడిషనల్ కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు విచ్చేస్తారని చెప్పారు.

రేపు ద్విచక్ర వాహనాలకు వేలం

తాండూరు: అబ్కారీ నేరాల్లో పట్టుబడిన రెండు స్ప్లెండర్ బైక్‌లకు ఈ నెల 25న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ తాండూరు సీఐ బాల గంగాధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు తాండూరు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈ వేలం ఉంటుందని చెప్పారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

బాలకేంద్రంలో సమ్మర్ క్యాంపు

ఈ నెల 26 నుంచి మే 26 వరకు

అనంతగిరి: వికారాబాద్‌లోని బాలకేంద్రంలో సమ్మర్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ అనురాధ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి మే 26 వరకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఈ క్యాంపు కొనసాగుతుందని చెప్పారు. నృత్యం, వాయిద్యం, చిత్రలేఖనం, కుట్టు, అల్లికలు తదితర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఉంటుందని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 62048 24419 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

మోమిన్‌పేట ఎంపీడీఓ విజయలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు మోటార్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యదర్శులు ఉపాధి హామీ పనులను పర్యవేక్షించాలని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణలో రాజీ పడొద్దన్నారు. ఆడవి పందులు రైతులు సాగు చేస్తున్న పంటలను నాశనం చేస్తున్నాయని, ఈ విషయలో వ్యవసాయాధికారులు, అటవీశాఖాధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు. మండల కేంద్రంలోని పశు వైద్యశాల ఆవరణలోని భగీరథ నీటి పైపునకు మరమ్మతులు చేపట్టాలని ఆరు నెలలుగా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని పశువైద్యాధికారి గీత ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు, తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, ఏఓ జయశంకర్, ఏఈఓలు శ్రీనివాస్, చంద్రిక, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అబ్జర్వర్లుగా వినోద్‌రెడ్డి, నరేందర్

అనంతగిరి: తెలంగాణలోని అన్ని జిల్లాల్లో మండల, బ్లాక్ అధ్యక్షుల నియమకానికి కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీ భవన్‌లో పీసీసీ అబ్జర్వర్ల సమావేశం నిర్వహించారు. కాగా జిల్లా నుంచి ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి, రాంశెట్టి నరేందర్‌ను జిల్లా అబ్జర్వర్లుగా నియమించారు. మండలాధ్యక్ష పదవి కోసం ఐదుగురి పేర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం ముగ్గురు పేర్లను పంపాలని అబ్జర్వర్లకు సూచించారు.

మిత్రులు దూరం.. సెలవులు భారం

వీఎం హోంలోనే అనాథ విద్యార్థులు • స్నేహితులు ఇళ్లకు వెళ్తుంటే చెమ్మగిల్లుతున్న కళ్లు

హుడాకాంప్లెక్స్: వార్షిక పరీక్షలు ముగిశాయి. ఎండలు భగ్గున మండుతుండటంతో ప్రభుత్వం విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ, ప్రైవేటు వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులను వారి తల్లిదండ్రులు వచ్చి వెంట తీసుకెళ్లారు. అయితే సరూర్‌నగర్ విక్టోరియా మెమోరియల్ అనాథాశ్రమంలో చదువుతున్న 60 మంది మాత్రం సెలవుల్లోనూ వసతి గృహానికే పరిమితం అవుతున్నారు. ఇక్కడ 800 మంది పిల్లలు చదువుతున్నారు. వీరిలో అమ్మానాన్నలిద్దరూ చనిపోయిన వారితో పాటు సింగిల్ పేరెంట్ పిల్లలు కూడా ఉంటున్నారు. పాఠశాలకు సెలవులు కావడంతో వీరంతా తమ తండ్రి/ తల్లి/ గార్డియన్ వెంట సొంతూళ్లకు వెళ్తున్నారు. అయితే ఏ ఆదరణ లేని వారు మాత్రం భారంగా అక్కడే ఉండిపోతున్నారు. ఇప్పటి వరకు తమతో ఆడుకున్న మిత్రులు నెల రోజుల పాటు దూరం కానున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.



అక్కను తీసుకెళ్లారు కానీ..



మాది వలిగొండ. అమ్మానాన్నలు లేరు. చిన్నప్పుడే వాళ్లు నన్ను వదిలి వెళ్లారు. ఆ తర్వాత రామన్నపేటలోని మా అమ్మమ్మ, తాతయ్యలే నన్ను చేరదీశారు. వారికి సరైన ఆర్థిక స్తోమత లేకపోవడంతో నన్ను వీఎం హోంలో చేర్చారు. అప్పుడప్పుడు వచ్చి చూసి వెళ్తుంటారు. మా అక్క శ్రవంతి కూడా ఇక్కడే చదువుకుంది. పదో తరగతి వార్షిక పరీక్షలు ముగియగానే ఆమెను వెంట తీసుకెళ్లారు. కానీ నన్ను ఇక్కడే ఉంచారు. అందరిలాగే నాకు కూడా ఇంటికి వెళ్లాలని ఉంది. అమ్మానాన్నా లేరు కానీ ఇక్కడ అన్ని వసతులు ఉన్నాయి.

– శ్రవణ్‌కుమార్, 9వ తరగతి

అమ్మానాన్నలు లేకపోవడంతో..

మాది మాల్ మండలం నేరెళ్లపల్లి. పదేళ్ల క్రితమే ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి అమ్మ చనిపోయింది. ఆ తర్వాత అనారోగ్యంతో నాన్న కూడా చనిపోయాడు. నాతో పాటు తమ్ముడు ఉదయ్ కిరణ్ కూడా ఉన్నాడు. బంధువులు ఉన్నా.. ఎవరూ దగ్గరకు తీసుకోలేదు. అప్పటి నుంచి మేము ఒంటరి అయ్యాం. అప్పుడప్పుడు మా మామయ్య వచ్చి చూసి వెళ్తాడు. అమ్మానాన్నలు లేకపోవడంతో వేసవి సెలవులు వచ్చినా.. ఇంటికి వెళ్లలేని పరిస్థితి. వీఎం హోంలోనే ఉండిపోతాం.

– రాంచరణ్, 8వ తరగతి



బాధగా ఉంది



మాది వికారాబాద్ జిల్లా జిన్నారం గ్రామం. చిన్నతనంలోనే అమ్మానాన్నలు చనిపోయారు. ఎనిమిదేళ్ల క్రితం తాత, అమ్మమ్మ నన్ను వీఎం హోంలో చేర్పించారు. వాళ్లు ఏడాదికి ఒకసారి వచ్చి చూసి వెళ్తారు. పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో మిత్రులంతా వాళ్ల సొంతూళ్లకు వెళ్తున్నారు. కానీ నేను మాత్రం గత ఎనిమిదేళ్లుగా ఇక్కడే ఒంటరిగా ఉంటున్నా. ఇప్పటి వరకు ఊరికి కూడా వెళ్ల లేదు. సొంతూరిని గుర్తుపట్టలేను. నాకు కూడా మా గ్రామానికి వెళ్లాలని ఉంది. కానీ ఏం చేస్తాం. నన్ను తీసుకెళ్లే వారు లేరు. నాకు ఎవరూ లేరనే బాధకన్నా.. ఇప్పటి వరకు తోడుగా ఉన్న మిత్రులు కూడా నన్ను వదిలి వెళ్తుంటే బాధగా ఉంది.

– వై.శ్రీశైలం, 8వ తరగతి

సన్నాల సంబురం

రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు రేషన్ షాపుల వద్ద బారులు తీరుతున్నారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండడంతో అక్రమార్కులు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

రేషన్ బియ్యం కొనుగోలుకు లబ్ధిదారుల ఆసక్తి



దుకాణాల వద్ద క్యూ

- రెండు వారాల్లోనే 85.11 శాతం పంపిణీ
- గతంతో పోలిస్తే 225 మెట్రిక్ టన్నుల అధికంగా తీసుకున్న రేషన్ కార్డుదారులు

వికారాబాద్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేపట్టడంతో రేషన్ దుకాణాల్లో అమ్మకాలు పెరిగాయి. గతంతో పోలిస్తే జిల్లాలో లబ్ధిదారులు 225 మెట్రిక్ టన్నుల బియ్యం అధికంగా తీసుకున్నారు. ఇదివరకు ఎప్పుడు రేషన్ దుకాణాలకు రాని వారు సైతం ఈ నెల సన్న బియ్యం పంపిణీ అనగానే షాపుల ఎదుట బారులు తీరారు. ఈ నెల 4 నుంచి బియ్యం పంపిణీ ప్రారంభించగా 20వ తేదీ వరకు 85.11 శాతం బియ్యం పంపిణీ చేశారు. గతంలో దొడ్డు రకం బియ్యం పంపిణీ చేసే సమయంలో 80 శాతం బియ్యం పంపిణీ అయ్యేవి. మార్చి నెలలో నమోదైన గణాంకాలను బట్టి 80.40 శాతం బియ్యం పంపిణీ చేశారు. సన్న బియ్యం పంపిణీతో ఐదు శాతం పెరిగింది. మొత్తం మీద 225 మెట్రిక్ టన్నుల బియ్యం అధికంగా పంపిణీ అయినట్లు గణాంకాలు నమోదయ్యాయి.

అక్రమాలకు అడ్డుకట్ట

మిల్లర్ల మాయాజాలం.. రేషన్ డీలర్ల కుమ్మక్కు మంత్రం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో గతంలో రేషన్ బియ్యం పంపిణీ పథకం అబాసుపాలైన విషయం బహిరంగ రహస్యమే. ఇప్పటి వరకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యంలో 50 శాతానికి పైగా లబ్ధిదారులకు విక్రయించేవారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నోమార్లు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుబడేవి. ఈ నెల ఇలాంటి కేసు నమోదైన దాఖలా కనిపించలేదు. దొడ్డు బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసే మిల్లర్లు వాటినే రీసైక్లింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికి లెవీ రూపంలో ఇచ్చేవారు. వారికి ఇచ్చే ధాన్యం బయట విక్రయించి సొమ్ము చేసుకునే వారు. మెజార్టీ ప్రజలు సన్నబియ్యం తినేందుకు అలవాటు పడటం.. ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో ఆ పథకం ఫెయిల్యూర్ అయిందనే చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యం పథకంతో చాలా వరకు దుర్వినియోగాన్ని అరికట్టినట్టయింది.

రేషన్ సమాచారం	
మండలాలు	20
రేషన్ దుకాణాలు	588
రేషన్ కార్డులు	2,48,122
సభ్యులు	8,52,122
ఏప్రిల్ కోటా	5,582 మెట్రిక్ టన్నులు

అసత్య ప్రచారాలపై సీరియస్

ప్రభుత్వమే సన్నబియ్యం పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు రేషన్ షాపులకు క్యూ కడుతున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థపై నమ్మకం కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది. మిల్లర్ల మాయాజాలంతో దొడ్డుబియ్యాన్ని పాలిష్ చేసి సన్నబియ్యమని భ్రమలు కల్పించి పంపిణీ చేస్తే నమ్మకం పోయే ప్రమాదముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అవకతవకలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత అటు ప్రభుత్వంతో పాటు అధికారులపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా సన్నరకం బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం కలుపుతున్నారని ఇటీవల సన్నబియ్యంపై అనేక పుకార్లు షికార్లు చేయడంతో అధికారులు ఖండించారు. ఆధారాలు లేకుండా ప్రభుత్వాన్ని అబాసుపాలు చేసే వారిని ఉపేక్షించమని.. అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అవకతవకలకు తావివ్వం

సన్నబియ్యం పంపిణీతో ప్రజలు సంతోషంగా ఉన్నా రు. పంపిణీ చేసే స్టాక్ పా యింట్ మొదలుకుని రేష న్ దుకాణాల్లో లబ్ధిదారుల కు చేరే వరకు ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.పంపిణీ చేస్తున్న సమయంలో తూకం త క్కువగా వచ్చాయని కొన్ని చోట్ల ఆరోపణలు వచ్చా యి. వెంటనే తనిఖీ చేశాం. టెక్నికల్ సమస్యలవల్లే ఆరోపనలు వచ్చాయి వాటిలో వాస్తవం లేదు. గ తంతో పోలిస్తే ఈ నెల బియ్యం తీసుకెళ్లే వారి శా తం పెరిగింది.ఏ సమస్యలున్నా లబ్ధిదారులు ఫిర్యా దు చేస్తే తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటాం.

– మోహన్‌బాబు, డీఎస్‌ఓ, వికారాబాద్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

జూన్ 2 నుంచి 'భూ భారతి'

- ఆర్‌ఓఆర్ చట్టంతోనే భూ సమస్యలకు పరిష్కారం
- ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్
- కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్: భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకొచ్చిందని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పర్సాపూర్‌లో భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఆర్‌ఓఆర్ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్‌లో మార్పులు చేర్పులు, సాదా బైనామా వంటి సేవలు సులభంగా పరిష్కారం అవుతాయని చెప్పారు. ప్రజల వద్దకే అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తారని వివరించారు. భూ సమస్యలు పరిష్కారమైతేనే రైతు బీమా, రైతు భరోసా, రుణ మాఫీ ఇతర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతీ తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి అధికారులను అందుబాటులో ఉంచుతామన్నారు. జూన్ 2వ తేదీ నుంచి నూతన చట్టం భూ భారతి పోర్టల్ ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అనంతరం మున్సిపల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయం, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్య గౌడ్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, నందారం ప్రశాంత్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, మండల వ్యవసాయాధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

కేశంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన కేశంపేట పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులతో పాటు పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... టీకాల కార్యక్రమం సకాలంలో జరిగే విధంగా చూడాలన్నారు. డ్రాప్ అవుట్లు, లెఫ్ట్ అవుట్లను గుర్తించి వెంటనే టీకాలను వేయాలని చెప్పారు. ఆరోగ్య కార్యక్రమాలను మెరుగుపర్చుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో పరిశుభ్రతపైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సిబ్బంది రోగుల ఆరోగ్యం కోసం నిబద్ధతతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిత, సిబ్బంది ఉపేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, మెరిక్లిన్, సంగీత, చంద్రశేఖర్, హనుమంతు, సుజాత, సుమతి, వసంత, గీత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



కరన్‌కోట్ ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

సరిహద్దులో అప్రమత్తత అవసరం

- కోత్లాపూర్ చెక్‌పోస్ట్ వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయండి
- మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపాలి
- తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: రాష్ట్ర సరిహద్దు పోలీస్‌స్టేషన్లలో పని చేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన గౌతపూర్ సమీపంలోని కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జనరల్ డైరీ, కేసుల రిజిస్టర్, అరెస్టుల రికార్డు, రోల్ కాల్ రిజిస్టర్, రౌడీషీట్స్ తదితర రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో ఉన్న కరన్‌కోట్ ఠాణా పరిధిలోని కోత్లాపూర్ చెక్‌పోస్టు వద్ద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపాలన్నారు. కర్ణాటక నుంచి వచ్చే వాహనాలపై ఏమాత్రం అనుమానం వచ్చినా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుపై అవగాహన కల్పించాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విఠల్ రెడ్డి, కానిస్టేబుళ్లు ఉన్నారు.

అఘోరీకి 14 రోజుల రిమాండ్

- చేవెళ్ల కోర్టులో హాజరు పర్చిన పోలీసులు
- లింగ నిర్ధారణ పరీక్షల అనంతరం చంచల్‌గూడ జైలుకు తరలింపు



నార్సింగి పీఎస్ నుంచి అఘోరీని బయటకు తీసుకువస్తున్న మోకిల పోలీసులు

చేవెళ్ల/శంకర్‌పల్లి: అఘోరీ అలియాస్ శ్రీనివాస్‌ను అరెస్టు చేసిన మోకిల పోలీసులు బుధవారం చేవెళ్ల కోర్టులో హాజరుపర్చగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. పూజల పేరుతో అఘోరీ తనను మోసం చేసిందని, చంపుతానని బెదిరించి రూ.9.80 లక్షలు తీసుకుందని శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూర్ శివారులోని ప్రగతి రిసార్ట్స్‌లో నివాసముండే ఓ మహిళా సినీ నిర్మాత ఈఏడాది ఫిబ్రవరి 25న మోకిల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ మేరకు బీఎన్‌ఎస్ 308(5), 318(1), 351(3), 352 సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, గత మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్‌లో అఘోరీని అరెస్టు చేసి, తీసుకువచ్చారు. నార్సింగి ఏసీపీ కార్యాలయం నుంచి బుధవారం పోలీస్ వాహనంలో చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించి, సాధారణ వైద్య పరీక్షలు చేయించి, చేవెళ్ల జూనియర్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ధీరజ్‌కుమార్ ఎదుట హాజరుపరిచారు.

రిమాండ్ సమయంలో హైడ్రామా

న్యాయమూర్తి ఆదేశాల మేరకు మోకిల పోలీసులు అఘోరీని సంగారెడ్డి జిల్లా కంది జైలు అధికారులకు అప్పగించి వెళ్లారు. అయితే అఘోరీని ఏ బ్యారక్‌లో ఉంచాలనే సందేహం రావడంతో, వారు మళ్లీ మోకిల పోలీసులను పిలిపించారు. దీంతో అఘోరీని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. మహిళ అని గుర్తించిన తర్వాత చంచల్‌గూడ జైలుకు తరలించారు. అరెస్టు సమయంలో అఘోరీ నుంచి రూ. 5,500 నగదు, నేరాలకు ఉపయోగించిన ఐ20 కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సులభంగా డబ్బు కోసమే..

తనను తాను అఘోరీ మాతగా ప్రకటించుకుని రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రీనివాస్(28) సులభంగా డబ్బు సంపాదించడంతో పాటు ఇతర కారణాలతో చెన్నై, ఇండోర్‌లో లింగ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయించుకున్నాడు. అనంతరం ఆధ్యాత్మిక వేషధారణలో కనిపిస్తూ, తంత్ర పూజలు అంటూ అమాయకులను మోసం చేస్తూ ఆర్థికంగా లబ్ధి పొందుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

పోలీసులు, కోర్టులకు సహకరిస్తా..

చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని పోలీసులు, కోర్టులకు పూర్తిగా సహకరిస్తానని అఘోరీ తెలిపారు. జడ్జి ముందు హాజరైన సమయంలో తనకు లాయర్‌ను పెట్టుకునే స్తోమత లేదని, ప్రభుత్వ అడ్వకేట్‌ను ఏర్పాటు చేయాలని అఘోరీ కోరినట్లు తెలిసింది. అరెస్ట్, కస్టడీ నేపథ్యంలో కోర్టులో ఎలాంటి వాదనలు జరగలేదని సమాచారం. అఘోరీ అభ్యర్థన మేరకు న్యాయమూర్తి ఈ కేసును లీగలేయిడ్ కౌన్సిల్‌కు అప్పగించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలుసుకుని కేసును ముందుకు తీసుకెళ్తానని ఆయన తెలిపారు.

హోమ్‌కు శ్రీవర్షిణి..

అఘోరీతో పాటు శ్రీవర్షిణిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మోకిల పీఎస్‌లో ఆమెకు కౌన్సెలింగ్ ఇప్పించారు. అనంతరం నగరంలోని హైదర్షాకోట్ కస్తూర్బాగాంధీ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు.

క్లుప్తంగా

పాఠశాలలో వీడ్కోలు సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

బంట్వారం: మండల పరిధిలోని సల్బత్తాపూర్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థుల పట్ల ఓ కన్నేసి ఉంచాలన్నారు. ఈత కొలనుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. 2025–26 విద్యా సంవత్సరం నాటికి విద్యార్థుల సంఖ్యను బాగా పెంచాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శివకళ, హెచ్ఎంలు నాగజ్యోతి, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, వెంకటేష్, విశాల్, తుకారాం, భగవాన్‌కృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్

బషీరాబాద్ రూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను కరన్‌కోట్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని వీర్‌శెట్టిపల్లి గ్రామ శివారులో ఉన్న కాగ్నా నదిలో యాలాల మండలం అగ్గనూర్‌కు చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం ఉదయం పోలీసులు దాడి చేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గాలి వానకు నేలరాలిన మామిడి



తోటలో నేలరాలిన మామిడి కాయలు

కడ్తాల్: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం కురిసిన ఈదురు గాలులతో కూడిన వానకు మామిడి తోటలోని కాయలు నేల రాలాయి. అసలే ఈ ఏడాది అంతంతా మాత్రమే కాసిన మామిడి, అకాల వర్షాలకు నేలరాలడంతో తీవ్రంగా నష్ట పోయామని బాధిత రైతులు పేర్కొంటున్నారు. మండల కేంద్రం సమీపంలో బీక్యానాయక్‌కు చెందిన ఆరు ఎకరాల మామిడి తోట గాలి వానకు పూర్తిగా కాయలు నేలరాలడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి, నష్ట పోయిన మామిడి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మేడే వాల్ పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

తుర్కయంజాల్: మే 1వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ కార్మిక దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్ర మోహన్ కోరారు. బుధవారం తుర్కయంజాల్‌లో మేడే వేడుకల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మాల్యాద్రి, సత్యనారాయణ, శ్రీనివాసులు, కృష్ణ, మాధవరెడ్డి, జంగయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

లారీలో చెలరేగిన మంటలు



మంటలు ఆర్పుతున్న ఫైరింజన్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: అకస్మాత్తుగా ఇంజన్‌లో మంటలు చెలరేగి ఓ లారీ దగ్ధమైన సంఘటన ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఏపీ నుంచి గ్రానైట్ లోడ్‌తో లారీ హైదరాబాద్‌కు వస్తోంది. మార్గమధ్యలో ఇబ్రహీంపట్నం చెరువు కట్టపైకి రాగానే సాంకేతిక లోపంతో ఇంజన్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. డ్రైవర్ చకచక్యంగా లారీ నుంచి దూకి ప్రాణాలను కాపాడుకున్నాడు. మంటలకు లారీ ముందుభాగం పూర్తిగా దగ్ధమైంది. సంఘటనా స్థలానికి వచ్చిన ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. దీనిపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

పనులు కావాలంటే.. అక్కడికి వెళ్లాల్సిందే!

జిల్లాల పునర్విభజనలో భాగంగా వికారాబాద్ జిల్లా ఏర్పడింది. అందులో పరిపాలన సౌలభ్యం దృష్ట్యా నూతనంగా మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కోవలోకి చెందిందే దుద్యాల్. మండలం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాల సేవలు మాత్రం పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు.

- దుద్యాల్‌లో ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్లలో పలు సర్వీసులు కరువు
- పాత మండలానికి రెఫర్ చేస్తున్న అధికారులు
- తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్న స్థానికులు



పాత గ్రామ పంచాయతీలోనే కొనసాగుతున్న ఎంపీడీఓ కార్యాలయం

దుద్యాల్: నూతనంగా ఏర్పడిన దుద్యాల్ మండలంలో ప్రభుత్వ సర్వీసులు అంతంత మాత్రంగానే కనిపిస్తున్నాయి. మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ వంటి ప్రధాన కార్యాలయాలను ప్రభుత్వ పెద్దటు ఆర్భాటంగా ప్రారంభించారు. అయితే ఒక్క తహసీల్దార్ కార్యాలయంలో మాత్రమే అన్ని కార్యకలాపాలు, అందుకు సంబంధించి అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ ఏర్పాటై దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా కేసుల నమోదు, ఇతర సర్వీసులు ఊసే లేదు. రెండు నెలల క్రితం ఏర్పాటైన ఎంపీడీఓ కార్యాలయంలో కూడా సేవలు అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని మండలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పనుంటే బొంరాస్‌పేట్, కొడంగల్, దౌల్తాబాద్ కేంద్రాలకు వెళ్లమని చెబుతున్నారని పేర్కొంటున్నారు.

లాగిన్‌దే అసలు సమస్య!

దుద్యాల్ మండల ఎంపీడీఓ కార్యాలయంలో ప్రస్తుతం పుట్టిన, మరణ ధ్రువీకరణ పత్రాలు, భవన అనుమతులు, ప్రజాపాలన సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఉపాధి హామీ, కార్పొరేషన్, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ వంటి అనేక రకాల సేవలు లేవని కార్యాలయ సిబ్బంది తెలిపింది. ప్రజలకు అధికంగా ఉపయోగపడే సర్వీసులు అన్ని పాత మండలానికి సంబంధించిన లాగిన్‌లోనే కొనసాగుతున్నాయని అధికారులు తెలుపుతున్నారు. మండలం ఏర్పడి కార్యాలయాలు వచ్చినా సేవలు మాత్రం రాకపోవడంతో మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్ సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో పాత ఠాణాకే కేసులు రెఫర్ చేస్తున్నారు. అలాగే మండలానికి వ్యవసాయ అధికారిని నియమించిన శాఖకు సంబంధించిన ప్రధాన సేవలు అందుబాటులో లేకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. ఇలా మండలం ఏర్పడిన తర్వాత సైతం పూర్తిస్థాయిలో సర్వీసులు లేకపోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి కార్యాలయాల్లో సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పసిడి షాపులపై దాడులు

తూకం మిషన్లు పరిశీలించిన తూనికలు, కొలతల శాఖ అధికారులు



బంగారం షాపులో తనిఖీలు చేస్తున్న అధికారులు

తాండూరు: పక్షం రోజుల వ్యవధిలోనే తులం బంగారం ధర రూ.లక్ష దాటింది. దీంతో తూకాలలో మోసాలు జరగకుండా ఉండేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులు బంగారం, స్వర్ణకారుల దుకాణాలపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. బుధవారం ఆ శాఖ జిల్లా అధికారి రియాజ్ హైమద్‌ఖాన్ ఆధ్వర్యంలో తాండూరులో బంగారం దుకాణాలను తనిఖీ చేసి తూకపు మిషన్లను పరిశీలించారు. గతంలో తూకపు యంత్రాలకు వేసిన సీల్‌లు సరిగా ఉన్నాయా లేదా అని నిశితంగా చెక్ చేశారు. పట్టణంలో మొత్తం 53 తూకపు మిషన్లను తనిఖీ చేశారు. అయితే ఎన్ని యంత్రాలు సరిగా పని చేస్తున్నాయనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. అనంతరం అధికారి మాట్లాడుతూ.. జిల్లాలో వ్యాపార సంస్థలు, దుకాణాలలో వినియోగిస్తున్న తూకపు యంత్రాలు చెక్ చేయడంతో పాటు సీల్ వేసి స్టాంపింగ్ నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగానే బంగారం దుకాణాలను తనిఖీ చేశామన్నారు. తూకాలలో మోసం చేస్తే శాఖ పరమైన చర్యలు తీసుకొంటామన్నారు. తూనికలు, కొలతల శాఖ అధికారులు ఏకకాలంలో తనిఖీ చేయడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. పసిడి ధరలు పెరగడంతో ఈ దాడులు జరిగి ఉంటాయని స్థానికులు గుసగుసలాడారు.

బాధితులకు న్యాయం చేయండి

కలెక్టర్‌కు ప్రజాసంఘాల నాయకుల విజ్ఞప్తి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని కుదురుమల్ల గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి బాధితులకు న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ.. కుదురుమల్ల గ్రామంలో దళితులకు అవమానం జరిగిందన్నారు. దళితులను దేవాలయ ప్రవేశం లేకుండా కొందరు గ్రామస్తులు అడ్డుకున్నారని ఆరోపించారు. దుద్యాల్ మండలం కుదురుమల్లలో దళితులు ఈ నెల 14వ తేదీన డా.బీఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు అడ్డుకున్నారన్నారు. బాబాసాహెబ్ చిత్రపటాన్ని చింపివేశారని అన్నారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవమానం జరిగిన దళితులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటయ్య, బుస్స చంద్రయ్య, రమేష్‌బాబు, కొత్తూరు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిగిలో దొంగల బీభత్సం

ఇంట్లో చొరబడి రెండున్నర తులాల బంగారం, 28 తులాల వెండి, నగదు అపహరణ



చిందరవందరగా పడిన బీరువాలోని సామగ్రి

పరిగి: దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. పట్టపగలే ఎవరూ లేని ఇళ్లను టార్గెట్ చేసి చోరీలకు తెగబడుతున్నారు. బుధవారం పరిగి పట్టణ కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన తుక్యానాయక్ ఇంట్లో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. తన కొడుకు పెళ్లి వ్యవహారంలో స్వగ్రామమైన సోందేపూర్ అనుబంధ గ్రామంలోని మైసమ్మచెరువు తండాలో కుటుంబ సమేతంగా బీజీగా ఉండగా, అదే ఇంట్లో రెంట్‌కు ఉంటున్న ముజీబ్ సైతం అత్తగారింటికి వెళ్లారు. అదే అదును చూసిన దొంగలు.. తాళాలు విరగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఉదయం ఇంటికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బట్టలు చిందరవందర కావడమే కాకుండా అందులో పెట్టిన బంగారం, వెండి ఆభరణాలు, నగదును దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడి పెళ్లి కోసం తెచ్చుకున్న రెండున్నర తులాల బంగారం, 28 తులాల వెండి ఆభరణాలు, రూ.2.15 లక్షల నగదును అపహరించుకుపోయినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

రజతోత్సవ సభకు తరలిరండి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్



మోమిన్‌పేట: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు భారీగా తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు డి.వెంకట్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభకు 600 నుంచి 800ల మంది వరకు సభకు తరలి వెళ్లాల్సి ఉందన్నారు. 12 బస్సులు రానున్నాయని, మిగతా వారు ప్రైవేట్ వాహనాల్లో రావాలన్నారు. సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి వ్యతిరేకత ఉందని, వచ్చే స్థానిక ఎన్నికలలో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ, ఎంఈఓ పురన్‌దాస్ తదితరులు

చేవెళ్ల: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బీఆర్ఎస్ నాయకుడు విఘ్నేశ్‌గౌడ్ ప్రోత్సాహకాలు అందజేశారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన విద్యార్థికి 10వేలు, మెరిట్ సాధించిన 8 మంది విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి 5వేల రూపాయల చొప్పున నగదు ప్రోత్సాహకాలను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ఆర్డీఓ చంద్రకళ, ఎంఈఓ పురన్‌దాస్, తహసీల్దార్ కృష్ణయ్య, సీఐ భూపాల్‌శ్రీధర్ చేతుల మీదుగా విద్యార్థులకు ఆయన నగదు అందజేసి సన్మానించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు విఘ్నేశ్‌గౌడ్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ జైపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అంజనేయులు, నాయకులు సాయికుమార్‌గౌడ్, రాజిరెడ్డి, పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



కోకట్ మార్గంలో లభ్యమైన మృతదేహం

యాలాల: గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైన ఘటన మండల పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. కోకట్ మార్గంలో ద మ్యాన్ టీ సెంటర్ వద్ద సుమారు 50 ఏళ్ల వయసున్న ఓ వృద్ధుడు నిర్జీవంగా పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో వడ దెబ్బకు చనిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడు సుమారు 5 అడుగుల ఎత్తు, ఒంటిపై తెల్ల రంగు బనియన్, నీలపు రంగు గళ్ల లుంగీ ఉందని ఎస్ఐ తెలిపారు. మృతుడిని ఎవరైన గుర్తిస్తే వెంటనే పీఎస్(87126 70054)కి సమాచారం ఇవ్వాలని కోరారు.

శుభకార్యాల్లో మాజీ ఎమ్మెల్యే సందడి



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: మండలంలోని ఆయా గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకలకు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎస్‌జీ గార్డెన్‌లో ఇమ్మడి సాయి వర్షిణి, సాయితరుణి నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ అంజిలయ్య, మాజీ వార్డు సభ్యుడు వసంతరావు, జర్నలిస్ట్ భాస్కర్ పాల్గొన్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు

సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహెర్



మేస్త్రీలకు బీమా బాండ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధుల

మహేశ్వరం: వ్యాపారంలో తిరుగులేని సంస్థగా భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో.. ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను విడుదల చేసిందని సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మహ్మద్ సాహేర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో శ్రీరామ స్టీల్ ట్రేడర్స్ డీలర్ షాపులో తాపీమేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్కెట్లో లభించే ఇతర సిమెంట్‌లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు ఈ సిమెంట్ సరైన ఎంపికని చెప్పారు. స్లాబ్ నిర్మాణ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని తెలిపారు. డీలర్ నర్సింహ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు. ఇతర సిమెంట్‌లతో పోలిస్తే ఇది చాలా బెటర్ అన్నారు. అంతకు ముందు తాపీమేస్త్రీలకు భారతి అల్ట్రాఫాస్ట్ సిమెంట్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. రూ.లక్ష ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేశారు.

టూరిస్టులపై దాడి పిరికిపంద చర్య

షాద్‌నగర్: టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికి పందల చర్య అని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు పాల్పడం బాధాకరమన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీసేందుకు, దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ఉగ్రవాదులు కుట్రపన్నారన్నారు. పార్టీలకతీతంగా అందరూ ఉగ్రదాడిని ఖండించాలని కోరారు. నిరాయుధులైన సామాన్యులపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన టూరిస్టులకు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశంలో అశాంతిని నెలకొల్పేందుకు కుట్రలు చేయడం సరికాదన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న పాట్లి మహరాజ్ ఆలయ కమిటీ సభ్యులు

తాండూరు: ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పాట్లి మహరాజ్, సీతారాంపేట్ ఆంజనేయ స్వామి ఆలయాల నూతన పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. పాట్లి మహరాజ్ ఆలయ చైర్మన్‌గా ప్రసాద్‌గౌడ్, సభ్యులుగా నవీన్‌గౌడ్, జగన్నాథ్, సిద్దమ్మ, శ్రీనివాస్, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా అనంత్ భట్, సీతారాంపేట్ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా భీమలింగం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన పాలకమండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓ నరేందర్, భద్రేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అబ్దుల్ రవూఫ్, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వానర గుంపు.. రాకపోకలకు ముప్పు



ధారూరు: పొలాల్లో పంటలు లేకపోవడంతో వానర గుంపు గ్రామాల వైపు మళ్లాయి. ఆహారం కోసం ఇళ్లు, రోడ్లపైకి చేరి నానా అలజడి సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా రహదారిపై వెళ్లే వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. దీంతో ప్రయాణం చేయాలంటేనే హడలి పోతున్నారు. ఇలా ధారూరు కేజీబీవీ సమీపంలో రోడ్డుపై కోతుల సమూహం చేరి వాహనాల రాకపోకలకు అవరోధం కలిగిస్తున్నాయి. పలు సందర్భాల్లో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

ఓర్పుతో సమస్యలు పరిష్కరించండి

అదనపు కలెక్టర్ సుధీర్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

తాండూరు రూరల్: ప్రజా సమస్యలను ఓర్పుగా విని పరిష్కారం చూపాలని అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పాలన లేనందున పంచాయతీ కార్యదర్శులు రోజూ గ్రామాలకు వెళ్లి సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతో మాట్లాడి ఇళ్లు లేని నిపేదలను గుర్తించాలన్నారు. పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. నర్సరీల నిర్వహణ, ఉపాధి కూలీల పెంపుతో పాటు అడిగిన ప్రతీ కూలీకి ఉపాధి కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ అధికారిణి శ్రీదేవి మాట్లాడుతూ.. గ్రామాల్లో పొలాలకు నా శనం చేస్తున్న అడవి పందుల బెడదను నిర్మూలించేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంపీఓ సుశీల్‌కుమార్, ఏపీఓ నరోత్తంరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

షాబాద్: ట్రాక్టర్ టైర్ కింద పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన రుద్రారం వద్ద బుధవారం చోటు చేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ గ్రామానికి చెందిన ఎం.రాజు(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. హైతాబాద్ నుంచి ట్రాక్టర్‌పై నాగర్‌గూడ వెళ్తుండగా మార్గమధ్యలో రుద్రారం వద్ద ముందు వీల్ విరిగి పోయింది. దీంతో రాజు సడన్‌బ్రేక్ వేసి ట్రాక్టర్‌పై నుంచి దూకే క్రమంలో టైర్ కింద పడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యాన్ని దుర్వినియోగం చేయొద్దు



బొంరాస్‌పేట: ఏర్పుమళ్లలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు



కొడంగల్: హస్నాబాద్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

బొంరాస్‌పేట: వరి ధాన్యాన్ని ఎక్కడా దుర్వినియోగం చేయొద్దని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని ఏర్పుమళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని ఇన్‌చార్జులకు ఆదేశాలిచ్చారు. ఇప్పటికే జిల్లాలో 128 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెలాఖరుకల్లా పూర్తి స్థాయిలో వరిధాన్యం కేంద్రాలకు చేరుతుందన్నారు. అనంతరం దుద్యాల మండల పరిధిలోని శ్రీసాయి రైస్ ఇండస్ట్రీస్‌ను తనిఖీ చేశారు. సంబంధిత రైస్ మిల్లు నుంచి సీఎంఆర్ ధాన్యం ప్రభుత్వానికి చెల్లించాలని ఆదేశాలిచ్చారు. బ్యాంకు గ్యారంటీ ఇవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో డీఎస్ఓ మోహన్‌బాబు, డీఎం మోహన్‌కృష్ణ, డిప్యూటీ తహసీల్దారు గణపతి తదితరులు ఉన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కొడంగల్: నియోజకవర్గంలోని ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పర్సాపూర్, హస్నాబాద్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులను నమ్మి మోస పోవద్దన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, తహసీల్దార్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అంజద్, పకీరప్ప పాల్గొన్నారు.